
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 19 సెప్టెంబరు 2024

రేపు జిల్లాకు చంద్రబాబు రాక



శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా ఆయన జిల్లాకు వస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్రువీకరించారు. కవిటి మండలం రాజపురంలో జరగనున్న 'ఇది మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. జిల్లాకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరత్రా అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు బుధవారం రాత్రి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వైద్య కళాశాలకు సుస్తీ

- కీలక విభాగాధిపతుల పోస్టులు ఖాళీ
- అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా..
- వేధిస్తున్న ట్యూటర్ల కొరత
- విశాఖ నుంచే ఎక్కువమంది రాకపోకలు



శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న శ్రీకాకుళం రిమ్స్ (రాజీవ్ గాంధీ మెడికల్ అండ్ సైన్సెస్)కు సుస్తీ చేసింది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ వైద్య కళాశాల మాత్రం బాగుపడడం లేదు. కీలకమైన విభాగాధిపతి (ప్రొఫెసర్) పోస్టులు అత్యధికంగా ఖాళీగా ఉన్నాయి. అలాగే, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు కూడా ఏళ్లుగా భర్తీ కావడం లేదు. మరోపక్క ట్యూటర్ల కొరత కూడా వేధిస్తోంది. దీంతో వైద్య విద్య బోధనకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో 9 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 31 మంది ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా 22 మందే ఉన్నారు. ఊపిరితిత్తుల విభాగం(టీబీసీడీ), డర్మటాలజీ, ఫోరెన్సిక్, జనరల్ సర్జరీ, న్యూరాలజీ, యూరాలజీ, అంకాలజీలో మెడికల్, రేడియేషన్, సర్జరీ విభాగాలకు ప్రొఫెసర్లు లేరు. అలాగే, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు విభాగాలకు సంబంధించి 13 మంది చొప్పున 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లో పాథాలజీ, ఎమర్జెన్సీ, కార్డియోథెరపీ సర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, యూరాలజీ, అంకాలజీలో మెడికల్, రేడియేషన్, సర్జరీ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల్లో అనాటమీ, జనరల్ సర్జన్, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్, మైక్రోబయాలజీ, ఫిజియాలజీ, ఫార్మాకాలజీ, న్యూరోసర్జరీ, అంకాలజీ సర్జరీ పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా కళాశాలకు అవసరమైన ట్యూటర్లు కూడా లేరు. మొత్తం 56 మంది ట్యూటర్లు ఉండాల్సి ఉండగా కేవలం 16 మంది మాత్రమే ఉన్నారు. జనరల్ మెడిసిన్ 2, జనరల్ సర్జన్ 2, గైనకాలజీ 2, పిడియాట్రిక్స్ 2, అనస్తీషియా 5, ఆర్థో 2, ఈఎన్‌టీ 1, రేడియాలజీ 3, అనాటమీ 4, బయోకెమిస్ట్రీ 1, మైక్రోబయాలజీ 2, పాథాలజీ 6, పిజియాలజీ 4, ఫార్మకాలజీ 2, కమ్యూనిటీ మెడిసన్ 3.. ఇలా ఈ విభాగాలకు సంబంధించి ట్యూటర్లు లేరు.

పర్యవేక్షణ కరువు

వాస్తవంగా వైద్యవిద్యను బోధించే ప్రొఫెసర్లు, అసోసి యేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఓపీ కూడా చూడాల్సిఉంది. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ఈ పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంతో వైద్య కళాశాల ప్రగతి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తమ పిల్లల భవిష్యత్‌పై వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, వైద్య కళాశాల, ఆస్పత్రిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కరువైంది. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా, పేదలకు వైద్యం అందుతుందా, ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న లక్షల రూపాయల జీతానికి తగ్గట్లు సేవలు అందిస్తున్నారా వంటి విషయాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖ నుంచే రాకపోకలు..

వైద్య కళాశాలలో పని చేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ఇతర ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ వర్తిస్తుంది. కానీ, వీరిలో అత్యధిక మంది విశాఖపట్నంలో నివాసముంటూ హెచ్‌ఆర్‌ఏ పొందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. వైద్య కళాశాల మొత్తానికి హెడ్‌గా వ్యవహరించే ప్రిన్సిపాల్ సైతం విశాఖ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు వైద్యులు శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్‌లో ప్రైవేటు క్లినిక్‌లు పెట్టుకుని స్థానికంగా నివాసముంటున్నారు. వీళ్లందరూ సమయానికి వైద్య కళాశాలకు వెళ్లి.. ఎఫ్ఎల్ఆర్ఎస్‌లో హాజరువేసేసుకుని.. కొద్దిసేపు మొక్కుబడిగా విధులు నిర్వహించి తరువాత సొంతక్లినిక్‌లకు అతుక్కుపోతున్నారు. జిల్లాతో సంబంధంలేని ప్రొఫెసర్లు, అసిసోయేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు కొంతమంది నర్సులు విశాఖ నుంచి వచ్చి వెళ్తున్నారు.

ఇక ఒక ఎంఈవో మాత్రమే

- త్వరలో కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- స్కూల్ కాంప్లెక్స్ బాధ్యతలు హెచ్‌ఎంలకు



పొందూరు ఎంఆర్‌సీ కార్యాలయం

(పొందూరు)

కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలో సంస్కరణలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతోంది. మండలాల్లోని విద్యాసంస్థల పర్యవేక్షణ బాధ్యత గతంలో ఎంఈవోలపై ఉండేది. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా శాఖలో సంస్కరణల పేరుతో 2022 సెప్టెంబరు 9న జీవో నంబరు 154 తీసుకొచ్చింది. దీనిద్వారా ఎంఈవో-2లను నియమించింది. ఎంఈవో-1 ఏ బాధ్యతలు చూడాలి, ఎంఈవో-2 ఏ బాధ్యతలు చూడాలి అనే దానిపై విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధివిధానాలపై సమీక్షించి నూతన విద్యా విధానం ప్రకటించడానికి సిద్ధమవుతోంది. ఈ విధానంలో కేవలం ఒక్క ఎంఈవో మాత్రమే బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ మేరకు త్వరలో ఆదేశాలు జారీ చేయనుంది.

గతంలో వేర్వేరు బాధ్యతలు

గత ప్రభుత్వం ఎంఈవో-1, ఎంఈవో-2లకు వేర్వేరు బాధ్యతలను అప్పగించడంతో పలు ఇబ్బందులు ఎదుర య్యేవి. ఎంఈవో-1లు పాఠశాలల తనిఖీ, ఉపాధ్యాయులకు శిక్షణ, పాఠశాలల బలోపేతం, తదితర విధులు నిర్వహించే వారు. ఎంఈవో-2లు స్కూల్ రెడీనెస్, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, ఒకేషనల్ విద్య నాడు-నేడు, మధ్యాహ్నం భోజనం పరిశీలన తదితర బాధ్యతలు చూసేవారు. అయితే, ఇక నుంచి ఎంఈవో-2లు ఉండరు. పాత విధానంలో మండలానికి ఒక్క ఎంఈవో మాత్రమే ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. వీరిపై పని భారాన్ని తగ్గించడానికి కొన్ని విధానాలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా కొన్ని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల బాధ్యతను స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్, హైస్కూల్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు. హెచ్‌ఎంలు డీడీవోలుగా వ్యవహరించనున్నారు. దీనివల్ల ఎంఈవోలకు పరిపాలనాపరమైన బాధ్యతలు మాత్రమే ఉండడంతో కొంత భారం తగ్గనుంది.

ఆదేశాలు రావాలి

మండలానికి ఒక్క ఎంఈవో మాత్రమే అనే దానిపై ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలి. ఆదేశాలు వస్తే ప్రక్రియ మొదలుపెడతాం.

-తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ), శ్రీకాకుళం

భోగాపురం విమానాశ్రయానికి

అల్లూరి సీతారామరాజు పేరు

- 6 నెలల ముందుగానే అందుబాటులోకి తెస్తాం
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



అరసవల్లి సెప్టెంబరు 18: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును పెడుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది అల్లూరికి దక్కిన గౌరవం అని ఆనందం వ్యక్తం చేశారు. గడువు ప్రకారం 2026 డిసెంబరు నాటికి విమానాశ్రయం పూర్తవ్వాల్సి ఉందని, కానీ ఆరు నెలల ముందుగానే జూన్ 26 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

- మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకోవడంపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశం కోసం సరిహద్దుల్లో ఎన్నో క్లిష్టమైన పరిస్థితుల్లో సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. జవాన్లకు మద్దతుగా నిలిచేలా దేశంలోనే తొలిసారిగా జవాన్ డిక్లరేషన్ ప్రకటించామన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా, సీఎం చంద్రబాబు సారథ్యంలో మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్‌కు ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. సైనికులు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అక్రమ రవాణాను అడ్డుకోండి: ఎస్పీ



పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రణస్థలం, సెప్టెంబరు 18: జిల్లాలో ఇసుక, గంజాయి, మద్యం అక్రమ రవాణా ను అడ్డుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా ముఖద్వారం పైడిభీమ వరం చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇతర విభాగాల సమన్వయంతో సరిహద్దు చెక్ పోస్టు వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చి పైడిభీమవరంలో ఉన్న వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఇందులో భాగంగా పైడిభీమవరం వద్ద ఉన్న ప్రత్యేక పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేశారు. ఆదేవిధంగా జేఆర్‌పురం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద్, సీఐలు అవతారం, ఇమ్మైనల్‌రాజు, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది?

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా
- 'వంద రోజుల పాలన' సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు
- దీపావళికి ఉచిత సిలిండర్లు



విజయవాడ సమావేశంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు శిరీష, శంకర్, రవికుమార్, రమణమూర్తి, గోవిందరావు

శ్రీకాకుళం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటడంతో విజయవాడలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గొండు శంకర్ (శ్రీకాకుళం), కూన రవికుమార్ (ఆమదాలవలస), మామిడి గోవిందరావు(పాతపట్నం), గౌతు శిరీష (పలాస), బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం), నడుకుదిటి ఈశ్వరరావు(ఎచ్చెర్ల), బగ్గు రమణ మూర్తి(నరసన్నపేట), నిమ్మక జయకృష్ణ(పాలకొండ), కళా వెంకటరావు (చీపురు పల్లి), కోండ్రు మురళీ(రాజాం) విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు హాజర య్యారు. ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది, కూటమి ప్రభుత్వం అందించిన పథకాలు ఇతరత్రా విషయాలపై ముఖ్యమంత్రి చర్చించారు.

జీవో 117 రద్దు చేయాలి

ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టే విధంగా గత ప్రభుత్వం జారీచేసిన జీవో 117ను రద్దుచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు.. మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పంచాయతీల రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు విన్నవించారు. బాగా పనిచేస్తున్నావంటూ ఈ సందర్భంగా ఎన్ఈఆర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు.

దీపావళికి శుభవార్త..

వచ్చే నెలలో జరిగే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్టోబరు 29 దీపావళి రోజున మూడు గ్యాస్ సిలిండర్లు అందించేందుకు రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 6,92,825 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ ఉచిత సిలిండర్లు అందనున్నాయి.

శారదాపురంలో కొండముచ్చుల దాడి

- పది మందికి గాయాలు

సోంపేట, సెప్టెంబరు 18: మండలంలోని శారదాపురం గ్రామంలో బుధవారం కొండముచ్చులు ప్రజలపై దాడి చేశాయి. ఈ దాడుల్లో పది మంది గాయపడ్డారు. గ్రామ సమీపంలో ఉన్న జీడి తోటల నుంచి కొండముచ్చుల గుంపు శారదాపురంలోకి వచ్చింది. వీధుల్లో ఉన్న ప్రజలపై దాడికి తెగబడ్డాయి. గ్రామానికి చెందిన బతకల శాంతమ్మ, పొందల జగదీష్, కొరికాన చిరంజీవి, కొరికాన రాములమ్మ, పొట్లూరు లక్ష్మీనారాయణ, పొందూరు బసంత తీవ్రంగా గాయపడగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా పలాస, మందస, బారువ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిని బీసీ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీ పరామర్శించా రు. ఇటీవల గ్రామంలో కొండముచ్చులు అధికంగా తిరుగుతున్నాయని, వాటి నుంచి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు, కాలుకు గాయాలైన దృశ్యం

మరో ఐదు రోజులే..

- ఈ- క్రాప్ నమోదుకు అవకాశం
- గడువు పెంచిన ప్రభుత్వం

నరసన్నపేట, సెప్టెంబరు 18: ఈ- క్రాప్ నమోదుకు సంబంధించి రైతులకు ప్రభుత్వం మరో ఐదు రోజులు అవకాశం కల్పించింది. వాస్తవానికి ఈనెల 15తో ఈ పంట నమోదుకు గడుపు పూర్తయింది. అయితే, తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునగడంతో వ్యవసాయశాఖ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పంట నష్టం అంచనా వేయడంలో తలమునకలై ఉన్నారు. దీంతో ఈ- క్రాప్ నమోదు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో ఈ- క్రాప్ నమోదుకు ప్రభుత్వం ఈనెల 23 వరకు గడువు పెంచింది. పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ధాన్యం కొనుగోలు వంటి పలు పథకాలు రైతులు దరి చేరాలంటే ఈ- పంట నమోదే ప్రామాణికంగా తీసుకుంటారు. జిల్లాలో 5,27,852 ఎకరాల పంట భూములు ఉండగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,44,103 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ నెల 15 నాటికి 4,42,782 ఎకరాల్లో (95.2శాతం) ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. మిగతా ఎకరాల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈనెల 25 నుంచి 27 వరకు రైతుభరోసా కేంద్రాల్లో డ్రాఫ్ట్ జాబితాపై గ్రామ సభలు నిర్వహిస్తారు. 28, 29 తేదీల్లో జాబితాలో ఉన్న అభ్యంతరాలను తొలగిస్తారు. తుది జాబితాను 30న ప్రదర్శించనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేడీ శ్రీధర్ కోరారు.

ఎట్టకేలకు పుస్తకాలు వచ్చాయ్

- బీసీ హాస్టల్ విద్యార్థులకు పంపిణీ
- త్వరలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహ విద్యార్థులకు కూడా..
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

(ఇచ్ఛాపురం)

జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎట్టకేలకు పాఠశాల పుస్తకాలు వచ్చాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పుస్తకాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనివల్ల పబ్లిక్ పరీక్షల్లో వారికి తక్కువ మార్కులు వచ్చేవి. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బీసీ వసతి గృహ విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేసింది. త్వరలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహ విద్యార్థులకు కూడా అందించనున్నారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం పాఠశాల అనే పేరుతో పుస్తకాలను (గైడ్ మాదిరి) ముద్రించి వారికి పంపిణీ చేసేది. ప్రతీ మూడు నెలలకు సంబంధించి అప్పటి వరకు పూర్తయిన అన్ని సబ్జెక్టుల సిలబస్‌లోని ముఖ్యమైన అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచేవారు. ప్రశ్నలు, జవాబులు అందులో ఉండేవి. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో వీటిని ముద్రించి విద్యార్థులకు అందించేవారు. ఇలా నాలుగుసార్లు ఇచ్చేవారు. ఈ పుస్తకాలను చదివి ఎంతోమంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేవారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పుస్తకాల పంపిణీకి మంగళం పాడింది. దీంతో విద్యా ర్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పాఠశాల పుస్తకాలను బీసీ హాస్టళ్లకు పంపిణీ చేస్తోంది. బయట మార్కెట్‌లో రూ.50 ఉన్న ఈ పుస్తకాన్ని హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో 80 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో 75 హాస్టళ్లలో 1,015మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఈ పుస్తకాలను అందిస్తున్నారు. త్వరలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు వీటిని పంపిణీ చేయనున్నారు.



ఇచ్ఛాపురం బీసీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పుస్తకాలు అందిస్తున్న వార్డెన్ రవికుమార్

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

హాస్టల్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. గత ప్రభుత్వం ఈ పుస్తకాలను టెన్త్ విద్యార్థులకు ఇవ్వకపోవడంతో కొంత మంది బయట కొనుగోలు చేసుకున్నారు. మరికొంతమంది విద్యార్థులకు కొనేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం మొదట్లోనే ఈ పుస్తకాలు అందించింది.

- రవికుమార్, వార్డెన్, ఇచ్ఛాపురం బీసీ హాస్టల్

హాస్టళ్లకు అందించాం

ఇంతవరకు మాకు వచ్చిన పుస్తకాలను డివిజన్ల వారీగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు అందించాం. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ టెన్త్ విద్యార్థులకు కూడా విడతల వారీగా పుస్తకాలు విడుదల అవుతాయి. వీరికి మలి విడతలో వచ్చే అవకాశం ఉంది.

-అనురాధ, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళలపైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు.. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యూజ్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణులతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

రైతుబజార్ లేక అవస్థలు

● దళారుల చెప్పిందే ధర ● ప్రత్యామ్నాయం లేక వారికే అమ్ముకుంటున్న రైతులు ● రోడ్లపైనే క్రయ, విక్రయాలతో ట్రాఫిక్ ఇబ్బందులు

(కొత్తూరు)

పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండల కేంద్రానికి చుట్టుపక్కల నాలుగైదు మండలాలతో పాటు, ఒడిశా రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి నిత్యం కూరగాయలను తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. అయితే మండల కేంద్రం లో రైతుబజార్ లేకపోవడంతో దళారులు ఓ ధర ను నిర్ణయించి వారినుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టంబారినపడు తున్నారు. రోజంతా పంటల సాగులో కష్టపడి ఓ నాలుగు రూపాయలు వస్తాయన్న ఆశతో దూర ప్రాంతాల నుంచి వచ్చి నా కనీసం గిట్టుబాటు కూడా కావడం లేదని, కనీసం రాకపోకల ఖర్చులు కూడా రావడం లేదని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. రైతు బజార్ ఉంటే కొనుగోలుదారులకే డైరెక్టుగా కూరగాయలను విక్రయించడం ద్వారా కొంతమేర ధర గిట్టుబాటవుతుందని వారు పేర్కొంటున్నారు. కొత్తూరు మండల కేంద్రానికి ప్రతిరోజూ అర్ధరాత్రి దాటిన తరువాత రైతులు కూరగాయ లను తీసుకువస్తారు. మంచి ధర వస్తే ఆనందపడతారు లేకుంటే తీవ్ర నిరాశతో వెనుదిరిగిన సందర్భాలూ లేకపోలేదు. ధర లేకుంటే దళారుల చెప్పిన మేరకు విక్రయించాల్సి వస్తోందని, కనీసం కోల్డ్ స్టోరేజీ అయినా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలు గ్రామాల రైతులు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉన్నా మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. సేంద్రీయ పద్ధతుల్లో అధిక శాతం కూరగాయలు సాగు చేసే రైతులు కొత్తూరు, సీతంపేట, భామిని మండ లాల్లోనే ఉన్నారు. అన్ని రకాల కాయగూరలు పండించినా మార్కెట్‌లో అమ్ముకోలేని పరిస్థితి ఎదురవుతోంది. తమ కష్టం దళారుల పాలవుతోందని వారు మథనపడుతున్నారు. గిట్టుబాటు అందని ద్రాక్షేనని వారం టున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి సాయంత్రం వరకు రైతులు ఎండ, వానలను సైతం లెక్క చేయకుండా ఆరుబయటే అమ్మకాలు సాగిస్తున్నారు. కాయగూరల అమ్మకానికి కొత్తూరు, సీతం పేట, భామిని, ఒడిశా ప్రాంతాల నుంచి తీసుకొస్తారు. నిత్యం 250 నుంచి 300 మంది రైతులు వారి పంట లను కొత్తూరుకు తీసుకు వస్తుంటారు. లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. పంచా యతీకి ఆశీలు రూపంలో ఆదాయం వస్తుంది. అయితే కనీసం షెల్టర్లు ఏర్పాటు చేయడం లేదని, దీంతో ఎండలకు, వానలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

● ఈ మార్కెట్‌కు ప్రధానంగా వంకాయలు, టమోటా, క్యారెట్, మొక్కజొన్న, ఆకుకూరలు, బెండకా యలు, దొండకాయలు, ఆనపకాయ లు, సొరకాయలు, మునక్కాయలు, చిక్కుడు, బీరకాయలు, పలు రకాల దుంపలు టన్నుల్లో తీసుకువచ్చి విక్రయాలు చేస్తారు. అయితే రైతుల పంటలకు దళారులు ధర నిర్ణయించడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. కొత్తూరులో వ్యాపారాలన్నీ రోడ్లపైనే సాగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందు లు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిం చి రైతు బజార్, కోల్డ్‌స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుతో పాటు కనీస మద్దతు ధరవచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



నివగాం రహదారికి ఆనుకొని కూరగాయలు అమ్ముతున్న దృశ్యం



ప్రతిరోజూ అర్ధరాత్రి తరువాత మార్కెట్ ఇలా..



ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్నాం..

ఎన్నో ఏళ్లుగా రైతుబజారు కోసం ఎదురుచూస్తున్నాం. పాలకులు హామీలిచ్చి మరిచిపోతున్నారు. ఫలితంగా మేం పండించే పంట దళారీలకు అమ్ముకొని నష్టపోతున్నాం.

-ఎద్దు నాగరాజు, రైతు, కొత్తూరు



రైతుబజార్ ఏర్పాటు చేయాలి..

కొత్తూరులో రైతు బజా రు ఏర్పాటు చేయడంతో మా రైతులకు ఉపయో గంగా ఉంటుంది. కొత్తూ రు, భామిని, సీతంపేట మండలాల రైతులకు లబ్ధి అవుతుంది. గిట్టుబాటు ధరకు అవకాశం ఉంటుంది. రైతబజారు లేకపోవడంతో రోడ్డు పక్కనే అమ్మకాలు చేయాల్సి వస్తోంది.

-బూరాడ తిరుపతిరావు, రైతు, సిరుసువాడ



కోల్డ్ స్టోరేజీ అవసరం..

మండలంలో రైతుబజారుతో పా టు కోల్ట్ స్టోరేజ్ అవసరం. ఈ రెండు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మామిడి గోవింద రావు దృష్టికి ఈ తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

-అగతముడి మాధవరావు, మాజీ సర్పంచ్, టీడీపీ నేత

సీఎం సహాయనిధికి రూ.3.05 లక్షలు

● మంత్రి లోకేశ్‌కు చెక్కుఅందించిన శిరీష



పలాసరూరల్: విజయవాడలో వరదల కారణంగా నిరాశ్రయులైన వారికి సహాయం చేసేందుకు గాను ఎమ్మెల్యే గౌతు శిరీష రూ.3.05 లక్షల చెక్కును బుధ వారం మంత్రి నారా లోకేశ్‌కు విజయవాడలో అందజే శారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి అందించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పలాస నుంచి పలువురు వ్యాపారులు సీఎం సహాయనిధికి చెక్కులు అందజేయగా 8వ తరగతి చదువుతున్న కె.రుచిత తోటి వారిని ఆదుకోవాలనే తపనతో రూ.10 వేలు అందించగా ఆ చెక్కును మంత్రి లోకేష్‌కు అందజేసినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.

స్వయంశక్తి సంఘాల బలోపేతానికి కృషి

పలాస: స్వయంశక్తి సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. విజయవాడలో మెప్మా ఎండీ తేజ్‌భరత్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పలాస నియోజకవర్గానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల పనితీరును వివరించారు. ఆర్పీల జీతభత్యం అంశాన్ని ప్రస్తావిస్తూ అం దులోని సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తమ నియోజక వర్గం అధిక శాతం ఉద్దాన ప్రాంతంతో కలిసి ఉందని, ఇక్కడ లభించే ముడిసరుకుతో కుటీర పరిశ్ర మలు ఏర్పాటుకు డ్వాక్రా సంఘాలకు ప్రాధాన్యత కల్పించాలని, దీనికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు బగా ది వాసుదేవరావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు గుర్తింపు కార్డులి వ్వాలని, కాంట్రగడ రిజర్వాయర్ పనులు చేయించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో సంఘం నేతలు బొడ్డేపల్లి మల్లయ్య, కొల్లి రామారావు, నంబూరు షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

వజ్రపుకొత్తూరు: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐ టీయూ నాయకులు తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయ కులు బాలజీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

హామీని అమలు చేయండి

పలాసరూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసి రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేయాలని ఏపీ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులకు పంటల బీమా చెల్లించాలని, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాల న్నారు. జీడి పంట మద్దతు ధరపై జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జీడి రైతుసంఘం సభ్యులు పాల్గొన్నారు.

1,108 లడ్డూలతో అర్చన



నరసన్నపేట: స్థానిక తిరుమల వీధి జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నవరా త్రులను పురస్కరించుకుని 1108 లడ్డూలను సమర్పించారు. అర్చకుడు భాస్కరభట్ల జగదీశ్వర శర్మ స్వామికి లడ్డూలతో అర్చన చేశారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

గణపతి లడ్డూ రూ.లక్ష

సంతబొమ్మాళి: మూలపేట గ్రామంలో గణపతి లడ్డూ రూ.1,01,100 పలికింది. గ్రామంలోని పెద్ద వీధిలో లడ్డూ వేలం వేయగా గ్రామానికి చెందిన జీరు ఎర్రన్న రెడ్డి, జీరు భాస్కర రెడ్డి, జీరు శ్రీనివాస్ వేలంలో దక్కించుకున్నారు. వారిని నిర్వా హకులు అభినందించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురంలో రూ.99 వేలు

పాతపట్నం: వినాయకచవితి వేడుకల్లో భాగంగా అచ్యుతాపురం గణేశ్ లడ్డూ రూ.99,200 కు గ్రామానికి చెందిన మజ్జి తిరుపతిరావు సొంతం చేసుకొన్నారు. శివశంకర్ నాల్గో వీధిలో లడ్డూ రూ.90 వేలకు బోను సంతోష్‌కుమార్ పాడి కైవసం చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో విగ్రహాలను భారీ ఊరేగింపుల మధ్య మహేంద్రతనయ నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

సర్వమంగళ వీధిలో రూ.80 వేలు

టెక్కలి: పట్టణంలోని సర్వమంగళవీధిలో వినాయక మండపం వద్ద నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో సనపల కుమారస్వామి రూ.80,200లకు కైవసం చేసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయనను నిర్వాహకులు అభినందించారు.

ఇసుక అక్రమంగా నిల్వ చేసే వారిపై చర్యలు

పెద్దకొల్లివలస(ఎల్.ఎన్.పేట): మండలంలోని వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తీసుకువెళ్లినా, అక్రమంగా నిల్వ ఉంచినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వైవీ పద్మావతి స్పష్టం చేశారు. పెద్దకొల్లివలస గ్రామసచివాలయం వద్ద అక్ర మంగా నిల్వ ఉంచిన ఇసుక పోగులను బుధవారం గుర్తించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమెతోపాటు డీటీ రషీద్ అహమ్మద్, ఆర్ఐ ఎస్. గవరయ్య, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

పలాసరూరల్: గరుడఖండి వద్ద ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం స్థల పరిశీలన చేశారు. బంక్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం, ఇతర అంశాలపై అధికారులను అడి గి తెలుసుకున్నారు. త్వరితగతిన ప్రహరీ, ఇతర అంశాలతో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్డీవో భరత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో జారిపడిన ఫోకస్ ల్యాంప్



టెక్కలి: స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళ వారం రాత్రి ఆపరేషన్ థియేటర్‌లోని ఫోకస్ ల్యాంప్ ఒక్కసారిగా జారిపడి పెను ప్రమాదం తప్పింది. ఒక రోగికి శస్త్ర చికిత్సకు సిబ్బంది సిద్ధమవు తున్న సమ యంలో ల్యాంప్ జారిపడడంతో అక్కడే ఉన్న వైద్యు రాలు, సిబ్బంది ప్రమాదం నుంచి సమయస్ఫూర్తిగా తప్పుకున్నారు. అయితే అక్కడున్న నర్సింగ్ సిబ్బందికి స్వల్పగాయాలయ్యాయి.

దేవాలయ స్థలంలో చెత్త వేయడంపై ఫిర్యాదు

టెక్కలి: పట్టణంలోని శ్యామసుందరస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో పంచాయతీ సిబ్బంది చెత్తను వేస్తున్నారని అర్చకుడు పద్మనాభ పండా డీఎల్పీవోకి ఫిర్యాదు చేశారు. పాత జాతీయ రహదారిపై ఓ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న దేవాలయ స్థలంలో పట్టణంలోని సేకరించిన చెత్తను, సిల్ట్‌ను వేశారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకో వాలని కోరారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి

టెక్కలి: సహారా ఇండియా బాధితుల సమస్యలను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లాకు చెందిన సహారా ఇండియా బాధితుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని కలిసి వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా తమ సమస్యను పాలకులు పట్టించుకోవడం లేదని, రాహుల్ దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగేటట్లు చూడాలని వారు కోరారు. కార్యక్ర మంలో డాక్టర్ రామ్మోహనరావు, టీబీజీ గుప్త, సహారా బాధిత కమిటీ అధ్యక్షుడు బైపల్లి సత్య రాజ్, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మాధవ రావు, వరప్రసాద్ తదితరులున్నారు.

సత్యసాయి విద్యావిహార్‌కు ఫర్నీచర్ వితరణ



పలాస: రామకృష్ణాపురం సత్య సాయి విద్యావిహార్ పాఠశాల అభి వృద్ధికి అరబిందో సంస్థ రూ.20 లక్షల విలువైన ఫర్నీచర్‌ను బుధవారం అం దించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మల్లా రామేశ్వరరావు మాట్లా డుతూ.. గ్రామీణ ప్రాంతంలో విద్యాభి వృద్ధికి పాఠశాలను ప్రారంభించామని, అరబిందో సంస్థ డైరెక్టర్ కె.నిత్యానందరెడ్డి, ఫౌండేషన్ డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డికి పాఠశాల ప్రాధాన్యత వివరించామన్నారు. ఆ మేరకు రీడింగ్ టేబుల్స్, లైబ్రరీ కుర్చీలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

అండర్‌పాసేజ్‌లో నిలిచిన నీటితో ఇక్కట్లు



నందిగాం: మండలంలో బుధవారం పడిన వర్షానికి రౌతుపురం రైల్వే అండర్ పాసేజ్‌లో నీరు చేరింది. దీంతో ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి అని, రోజుల తరబడి నీరు నిలిచిపోతుండడంతో వాహనాల రాకపోక లకు ఇబ్బంది కలుగుతోందని వారంటున్నారు. అయితే ఇటీవల కాలంలో ఎండల తీవ్రత వల్ల ఉక్కపోతకు గురైన ప్రజలు ఈ వర్షానికి కొంత ఉపశమనం పొందారు.

వరద బాధితులకు బ్రాహ్మణ సంఘం చేయూత

నరసన్నపేట: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం సత్యవరగ్రహారానికి చెంది న మారుతీబ్రాహ్మణ సంఘం చేయూత అందించేందుకు సిద్ధమైంది. బుధవారం దాతల నుం చి దుస్తులు, నిత్యావసర సరుకులను సేకరించారు. వీటిని విజయవాడ తరలిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

విజయనగరం కలెక్టర్‌కు రూ.31 వేలు అందజేత

జలుమూరు: మండలం మెట్టపేట గ్రామానికి చెందిన కరుకోల సూర్యనారాయణ విజ యవాడ వరద బాధితుల సహాయార్థం రూ.31,470 చెక్కును విజయనగరం కలెక్టర్ అంబేడ్క ర్‌కు బుధవారం అందజేశారు. సూర్యనారాయణ విజయనగరం మహారాజా కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. తోటి అధ్యాపకులు, విద్యార్థుల నుంచి కొంత విరాళం సేకరించి చెక్కును అందించారు.

టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించండి



వజ్రపుకొత్తూరు: టీడీపీ హయాం లో పూండి గోవిందపురం పంచాయతీ లో నిర్మించిన 40 మంది లబ్ధిదారులకు బిల్లు లివ్వలేదని, తక్షణం వాటిని చెల్లిం చేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ, ఆసు పత్రి మాజీ ఛైర్మన్ పుచ్చ ఈశ్వర రావు కోరారు. ఈ మేరకు బుధవారం గోవిందపురం సచివా లయంలో లబ్ధిదారులతో కలిసి అధికారులతో మాట్లాడారు. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైసీపీ నాయకులు బిల్లు లు నిలుపుదల చేశారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నా రు. అధికారులు సహకరించాలని కోరారు.

కనీస సదుపాయాలు లేక విద్యార్థుల ఇక్కట్లు





నరసన్నపేట: ఉర్లాం, జలుమూరు: కరవంజలో కబడ్డీ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నరసన్నపేట: ఉర్లాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండ ల స్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. వివిధ పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు హాజరు కాగా సరైన మైదానం లేకపోవడంతో కొన్ని క్రీడా పోటీలను నిర్వ హించి మిగిలిన పోటీలను మమ అని పించారన్న విమర్శ లు వినిపిస్తున్నాయి. క్రీడా మైదానం ఎత్తుపల్లాలుగా ఉండడంతో పోటీలకు ఇబ్బందులు కలిగాయని పలువురు క్రీడాకారులు ఆవేదన చెందారు. అలాగే భోజనాలు కూడా సరిపోకపోవ డంతో క్రీడాకారులు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మండ ల స్థాయి పోటీలకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై విద్యా ర్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

తూతూ మంత్రంగా గ్రిగ్స్ పోటీలు

జలుమూరు: విద్యార్థులను వివిధ క్రీడల్లో ఆసక్తి కన బరిచేందుకు గాను నిర్వహిస్తున్న గ్రిగ్స్ పోటీలకు సదుపా యాల కల్పనలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. క్రీడా ప్రదేశాల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు బుధవా రం కరవంజ ఆదర్శ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ ఆటలు పోటీలకు 9 పాఠశాలల నుంచి 120 మంది క్రీడా కారులు హాజరయ్యారు. ఈ పోటీలకు అవస రమైన ఏర్పాట్లు చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్ కూడా ఏర్పాటు చేయలేదని వారు అసంతృప్తి చెందారు.

క్రీడలతో మానసికోల్లాసం

పలాసరూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగు తుం దని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ అన్నా రు. బొడ్డపాడు జడ్పీ హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మండల స్థాయి అండర్ -14, 17 వాలీబాల్, కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహించారు. కార్యక్ర మంలో తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్, ఎం.కుమార్ రాజు, హెచ్ఎం వీర్రాజు, పీడీలు రాంజీ, తవిటయ్య, యువజన సంఘం అధ్య క్షుడు టి.క్రాంతి, బి.జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

కోటబొమ్మాళి: క్రీడల వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంఈ వో ఎల్వీ ప్రతాప్ అన్నారు. కురుడు జడ్పీ ఉన్నత పాఠశాల లో మండలస్థాయి గ్రిగ్స్ ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 300 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బుధవారం బహు మతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ ఎం బి.ఖగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగులో అవినీతి చీకట్లు

హరిపురం: మహిళల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన మండల వెలుగు కార్యా లయంలో అవినీతి చీకట్లు కమ్ముకుంటున్నాయి. కార్యాలయంలో వివిధ కార్యక్రమా లపై వీఎస్‌లు, డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన శిక్షణకు ప్రభు త్వం నుంచి రూ2.70 లక్షలు మంజూరు కాగా శిక్షణకు మహిళలు నామమాత్రంగా హాజరయ్యారు. మహిళలు హాజరు సింగిల్ డిజిట్ కూడా దాటకపోయినప్పటికీ ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసినట్లు మహిళలు ఆరోపి స్తున్నారు. విచారణ చేపడితే పూర్తిస్థాయిలో అవినీతి భాగోతం బయటపడుతుందని వారు అభిప్రాయ పడుతున్నారు. దీనిలో ఎంఎంఎస్ (మండల మహిళా సమాఖ్య) అధ్యక్షురాలి బాధ్య త కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా మండల అధికారులు అధ్యక్షు రాలి ఎన్నికపై ముందు చూపుతో వ్యవహరించారు. తమకు అనుకూలంగా ఉన్న మహిళను నియమించేం దుకు నిబంధనలు తుంగలో తొక్కారు. ఎంఎంఎస్ ఎన్నిక లకు ముందు మండలం లోని 56 గ్రామ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా.. ఆయా సంఘాలకు కనీసం చెప్పలేదని సమాచారం. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రాక ముందే ఈ తతంగం పూర్తి చేయడం కొసమెరుపు. ఈ విషయమై డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

విశ్వకర్మకు విశేష పూజలు

పాతపట్నం: స్థానిక రైల్వేగేట్ సమీపంలో విశ్వ బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవచన కంకణ ధారణ, గాయత్రి విశ్వకర్మ ఆవాహన తదితర కార్యక్ర మాలు చేపట్టారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనం

నందిగాం: నందిగాంలో విశ్వకర్మ విగ్రహ నిమజ్జ నోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించి స్థానిక పూడి చెల్లెమ్మ కోనేరులో నిమజ్జనం చేశారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాలవారు పాల్గొన్నారు.

మినీ గోకులాల ఏర్పాటుకు చర్యలు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పశు సంవర్ధక శాఖ ద్వారా మినీ గోకులాలను ఏర్పాటు చేయనున్నట్లు కొత్తూరు డివిజన్ ఏడీ జి.నారాయణరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాల యంలో బుధవారం ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద రావుతో మినీ గోకులాలపై చర్చించారు. పశువైద్యాధికారి జి. కవిత, గోపాలమిత్ర ఎ.రమణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సోమేశ్వరరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: పల్లిసారధి గ్రామానికి చెందిన పోతనపల్లి సోమేశ్వరరావు (39) గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమేశ్వరరావుకు 2020లో పెళ్లి అయింది. మద్యానికి బానిస అవ్వడంతో భార్య అతడిరి విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మరింత ఎక్కువగా మద్యం తాగుతున్నాడు. కొద్దిరోజుల కిందట గ్రామ పెద్దల సమక్షంలో భార్యాభర్తలకు విడాకులు జరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన సోమేశ్వరావు.. ఈనెల 11న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆయనను పలాస ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు.

దూషించిన కేసులో ఐదేళ్లు జైలు, జరిమానా

నరసన్నపేట: తామరాపల్లి గ్రామానికి చెందిన ముచ్చ గణేష్‌ను ఆదే గ్రామానికి చెందిన రావాడ లచ్చు కులంపేరుతో దూషించాడన్న కేసులో నేరం రుజువు కావడంతో లచ్చుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.16 వేలు జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ మేరకు ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. 2012 జూన్ 30న తామరాపల్లి గ్రామ సచివాలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఫ్లెక్సీలు కడుతున్న గణేష్‌ను రావాడ లచ్చు కులంపేరుతో దూషించి.. దుర్భాషలాడినట్లు గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. దీంతో అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ బాలరాజు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణ, వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి నిందితుడు లచ్చుకు మూడు సెక్షన్ల కింద ఐదేళ్లు జైలు, రూ.16 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పీపీ కె.ఉషారాణి బాధితుడి తరపున వాదించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన లిల్లీ

నరసన్నపేట: స్థానికంగా ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి కోరాడ సర్వేశ్వరరావు ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. నూకలమ్మ గుడి వద్ద ఉన్న మాల్‌లో పనిచేస్తున్న కోరాడ లిల్లీ ఈనెల 15న పెద్దపేటలో జరిగిన అన్నదానానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేశ్వరరావుది ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చత్రపూర్ స్వస్థలం. వ్యాపారం నిమిత్తం రెండేళ్ల కిందట నుంచి నరసన్నపేటలో ఉంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన ఘటనలో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 17 ఏళ్ల బాలికకు రెండున్నరేళ్ల కిందట తమ బంధువు శుభకార్యంలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా జయంత్ మండలం చీడిపూడి గ్రామానికి చెందిన సాహుకారి కృష్ణ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కృష్ణ జేసీబీ ఆపరేటర్ కావడంతో వృత్తి రీత్యా పైడిభీమవరంలో ఉంటున్నాడు. గడిచిన రెండేళ్లుగా బాలికతో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఆ బాలిక తనను పెళ్లి చేసుకోవాలని అడగడంతో సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నాడు. దీంతో బాలిక ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారి సాయంతో బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక ఫిర్యాదు మేరకు కృష్ణపై ఏఎస్‌ఐ నారాయణరావు పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఈ కేసు విచారణ చేపట్టారు.

జనరల్ స్టోర్స్‌లో చోరీ

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి మార్కెట్‌కు సమీపంలోని ముడియావీధి పక్కన గల ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవరవీధికి చెందిన కోరాడ కిశోర్ కుమార్‌కు చెందిన ఈ స్టోర్‌ను ఆదివారం రాత్రి 9గంటల సమయంలో మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు షాపు పైన రేకుని కట్ చేసి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌ను తెరిచి అందులో ఉన్న రూ.25వేలు నగదు అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న సీఐ మీసాల చిన్నమనాయుడు, పట్టణ ఎస్‌ఐ చిన్నమనాయుడు, క్లూస్ టీం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ తెలిపారు. అలాగే మార్కెట్‌లోని మరో రెండు షాపుల్లో చోరీకి పాల్పడి దుండగులు విఫలమయ్యారు. ఎటువంటి నష్టం జరగలేదని బాధితులు తెలిపారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్ల గ్రామ సమీపాన పాతజాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకపాలెం గ్రామానికి చెందిన బాడితమాను రాజు ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాజును చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం: నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నాగవరపు రాము ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పొట్టి శ్రీరాములు కూడలి వద్ద వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ పట్టుకున్నారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి.. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

చక్రధర్ విద్యా సంస్థల అధినేత మృతి


చక్రధరరావు(ఫైల్)

శ్రీకాకుళం క్రైం: నగరంలో చక్రధర్ విద్యా సంస్థల అధినేత యాల చక్రధరరావు గుండె పోటుతో బుధవారం మృతి చెందారు. జిల్లాలో చక్రధర్ ఐటీఐ, మెడికల్ విద్యా సంస్థలను స్థాపించి ఎందో విద్యార్థులకు ఉచిత విద్యను అందించిన చక్రధరరావు ఆకస్మిక మృతి విద్యారంగానికి తీరని లోటని ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ జిల్లా ప్రతినిధి పొన్నాన జయరాం తన సంతాపాన్ని తెలియజేశారు.

160 మద్యం సీసాలు స్వాధీనం


లావేరు: వెంకటాపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న 160 మద్యం సీసాలను మంగళవారం ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. వెంకటాపురం నుంచి విజయనగరం జిల్లా చీపురుపల్లికి మండలం కరకాం గ్రామానికి చెందిన గంగ్రేటి సంతోష్. గోనె సంచిలో పెట్టి తరలిస్తున్న 160 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

గుంతలో ఇరుక్కుంటే జాగారమే


గుంతలో ఇరుక్కుపోయిన లారీలు

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి సమీపంలో ఉన్న ఆలికాం-బత్తిలి ప్రధాన రహదారి గుంతలో ఇరుక్కున్న వాహనదారులకు ప్రతినిత్యం జాగారమే అవుతుంది. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంకు వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతల్లో వాహనాలు ఇరుక్కోవడం నిత్యకృత్యంగా మారాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇసుక లారీ ఇనుప ఊసలతో వెళుతున్న మరో లారీ ఒకే ప్రాంతంలో ఇరుక్కోవడంతో రాత్రంతా రెండు లారీల సిబ్బంది జాగారం చేశారు. అదే సమయంలో స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఉన్న గుంతలో ఇసుక లారీ ఇరుక్కుపోయి వారు కూడా ఉదయం వరకు వేచి చూడాల్సి వచ్చింది. బుధవారం ఉదయం జేసీబీల సాయంతో లారీలను బయటకు తీసి.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

టెక్కలిలో లెక్కల మాస్టారుగా..



- హేతువాదిగా, నాస్తికుడిగా, సాహితీవేత్తగా గుర్తింపు
- నేడు తాపీ ధర్మారావు జయంతి

ఎచ్చెర్ల: లెక్కల మాస్టారుగా టెక్కలిలో జీవితాన్ని ప్రారంభించిన తాపీ ధర్మారావు.. హేతువాదిగా, నాస్తికుడిగా, సాహితీవేత్తగా ఎంతో గుర్తింపు పొందారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.. దేవాలయాలపై బూతు బొమ్మలు ఎందుకు?, అలిండియా అడుక్కుతినేవాళ్ల మహాసభ, పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు, పాతపాళీ, కొత్త పాళీ, ఆంధ్రతేజం వంటి రచనలతో హేతువాదిగా, నాస్తికుడిగా, సాహితీవేత్తగా పేరొందిర సాహితీవేత్త తాపీ ధర్మారావు (తాతాజీ). చరిత్ర పరిశోధకునిగా, పత్రికా సంపాదకునిగా, సినీ గేయరచయితగా సుపరిచితులైన ఈయన తొలినాళ్లలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. పూర్వపు గంజాం జిల్లాలోని బెర్హంపూర్ (బరంపురం)లో 1887, సెప్టెంబరు 19న జన్మించిన తాపీ ధర్మారావు అసలు పేరు బండారు ధర్మారావునాయుడు. ఈయన వంశంలోని లక్ష్మన్న అనే వ్యక్తి సైనికోద్యోగం నుంచి తిరిగివచ్చి తాపీ పనిలో స్థిరపడ్డారు. ఆ తర్వాత కాలంలో ఒంటి పేరుకు ముందు తాపీ ఇంటి పేరుగా మారింది. ధర్మారావు విజయనగరం రిప్పన్ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. గణితం పై బాగా పట్టు సాధించారు. విజయవాడలో మెట్రిక్యులేషన్, పర్లాకిమిడిలో ఎఫ్‌ఏ వరకు చదివారు. పర్లాకి మిడిలో చదివే రోజుల్లో వ్యవహారిక భాషావేత్త గిడుగు రామ్మూర్తి పంతులు ఈయనకు గురువు. ఆ తర్వాత పచ్చయ్యప్ప కళాశాల, చెన్నైలో బీఏ చదివారు. కల్లికోట రాజా వారి కళాశాలలో ఈయన గణిత ఉపాధ్యాయులుగా పనిచేశారు. టెక్కలిలో లెక్కలు మాస్టారుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 15 రూపాయల జీతానికి ఉద్యోగం చేస్తూ టెక్కలిలోనే కాపురం పెట్టారు. 25 రూపాయల నెల జీతం కోసం బరంపురంలోని కళ్లికోట రాజా కళాశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తర్వాత పాత్రికేయ రంగంలో ప్రవేశించి తుది శ్వాస విడిచేవరకు అదే వృత్తిలోనే కొనసాగారు. ఈయన జయంతిని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా కూడా నిర్వహించుకుంటున్నాం.

గిడుగు నీడలో..

పర్లాకిమిడిలో ఎఫ్‌ఏ చదివే రోజుల్లో తాపీ ధర్మారావుకు గిడుగు రామ్మూర్తి పంతులు చరిత్ర పాఠాలు బోధించేవారు. ధర్మారావు ప్రతిభను తొలిసారిగా గుర్తించి ప్రపంచం దృష్టికి తీసుకువచ్చింది గిడుగువారే. వాడుక భాషలో కొత్త మెరుగులు తీసుకువచ్చారు ధర్మారావు. మన సినిమాల్లోనూ, పత్రికల్లోనూ ప్రామాణికం ప్రయోగాలుగా చలామణీ అవుతున్న వాటిలో ఎక్కువ భాగం ధర్మారావు చలువేనని చెబుతారు.

తొలి రచన 'ఆంధ్రులకొక మనవి'

1911లో ఈయన తొలి రచన 'ఆంధ్రులకొక మనవి' పేరిట వెలువడింది. కొండెగాడు, సమదర్శిని, జనవాణి, కాగడా తదితర పత్రికలు ఇతని ప్రతిభకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. మాలపిల్ల, రైతుబిడ్డ, కీలుగుర్రం, పల్లెటూరి పిల్ల, రోజులు మారాయి తదితర సినిమాలకు ఈయన సంభాషణలు రాశారు. తాపీ ధర్మారావును గౌరవంగా తాతాజీ అని పిలిచేవారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ముఖ్యమంత్రిగా బొబ్బిలి రాజా ఉన్నప్పుడు తాపీ ధర్మారావు ఆయన వద్ద కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల మహాసభకు తొలి అధ్యక్షుడు ఈయనే. తాపీ ధర్మారావు 1973 మే 8న తనువు చాలించారు. తెలుగు సినీదర్శకులు తాపీ చాణక్య ఈయన కుమారుడే.

గౌరవ పురస్కారాలు

శృంగేరి పీఠాధిపతులు జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి నుంచి 1926లో ఆంధ్ర విశారద బిరుదు, చామకూర వెంకటకవి రాసిన విజయవిలాసం కావ్యానికి చేసిన హృదయోల్లాన వ్యాఖ్యకు 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు.. ఇలా ఎన్నో పురస్కారాలు తాతాజీ పొందారు.

స్వచ్ఛత అందరి బాధ్యత


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్/ రూరల్: దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలన్న సంకల్పంతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం నగరపాలక కమిషనర్ ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఎంహెచ్‌వో సుధీర్ కుమార్, నగరపాలక కార్యాల య సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే నైర గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరవల రామప్రతాప్ పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామస్థులను సర్పంచ్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యదర్శి ఫల్గుణ నాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై నిలదీత

ఆమదాలవలస: మండలంలోని 2023-24 సంవత్సరం ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనుల్లో అక్రమాలపై నిర్వహించిన ప్రజావేదికలో పలువురు అధికారులు నిలదీశారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు ఆయా గ్రామ పంచాయతీల్లో నిధులు చెల్లింపులపై తనిఖీలు చేపట్టాయి. గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభల అనంతరం బుధవారం ఉపాధి కార్యాలయం ఆవరణలో మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన అవకతవకలపై సభలో ప్రస్తావించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనరసమ్మ, ఎస్‌ఆర్‌పీ పున్నపునాయుడు, ఈవోపీఆర్డీ గోవిందరావు, నాయకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, నూకరాజు, సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం: మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగరాణి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాదక ద్రవ్యాలువాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం బాలికలచే మానవహారం చేయించి ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్లు సుజాత, నీలవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

పొందూరు: మండలకేంద్రం పొందూరులో రెండురోజులపాటు జరగనున్న మండలస్థాయి గ్రిగ్స్ పోటీలను బుధవారం ఎంఈవోలు రామరాజు, పి.రాజారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ- ఇటువంటి క్రీడల నుంచే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారవుతారన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా క్రీడాసంస్థ కార్యదర్శి మోహనరావు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.శ్రీనివాసరావు, కె.శాంతారాం, హెచ్‌ఎం వెంకటరావు, పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు నిర్మాణంలో అవినీతి

పొందూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ కోర్టు నిర్మాణంలో అవినీతి చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రీడా కోర్టుల నిర్మాణానికి పీఎంశ్రీ పథకం కింద పాఠశాలకు రూ.99,500 మంజూరయ్యాయి. ఈ నిధులతో వివిధ కోర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. హెచ్‌ఎం వెంకటరావు తన కుమారుడి ద్వారా కేవలం వాలీబాల్ కోర్టును మాత్రమే నిర్మించి రూ.90 వేలు డ్రా చేసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సలహాలు తీసుకోకుండా వేసవిలో నిర్మాణం చేసేసా రు. ఈ నిర్మాణంలో సుమారు రూ.60 వేలు వరకు అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

అరసవల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని విద్యుత్తు వినియోగదారులు వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్తు బిల్లు వస్తుందన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను లేదా 1912 టోల్‌ఫ్రీ నెంబరులో సంప్రదించాలన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

అరసవల్లి: అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఎమ్మెల్యే గొండు శంకర్ భార్య, తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొని భోజనాలు వడ్డించారు. అన్న క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనాల నాణ్యతను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, టీడీపీ నాయకులు రెడ్డి గిరిజాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పక్కతోవ పట్టిన కుళ్లిన కోడి గుడ్లు అంశం


వివరాలు సేకరిస్తున్న అధికారులు

సోంపేట: జిల్లా పరిషత్ బాలకోన్నత పాఠశాలలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ మంగళవారం పరిశీలన సందర్భంగా పాడైన కోడిగుడ్లను గుర్తించి హెచ్‌ఎంను హెచ్చరించిన విషయం తెలిసింది. ఈవ్యవహారంలో స్థానిక అధికారులు ఎంఈవో ఎస్.జోరాడు ఆధ్వర్యంలో బుధవారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూతూ మంత్రంగా విచారణ జరిపి తమకు అనుకూలంగా నివేదికలు తయారు చేయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయంలో జిల్లాస్థాయి అధికారులు వచ్చి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

కంప్యూటర్లు అందించాలి

పొందూరు: ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం కంప్యూటర్స్, ప్రింటర్స్ ప్రభుత్వం అందజేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు కోరారు. పాఠశాలల్లో ఆన్‌లైన్ పనులు ఎక్కువగా ఉంటున్నాయని, కంప్యూటర్స్, ప్రింటర్స్ లేకపోడంతో ఇబ్బందిపడుతున్నారు. గతంలో ఉన్న లాప్‌ట్యాప్‌లను ప్రభుత్వం తీసుకుందన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరం

శ్రీకాకుళం క్రైం: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ట్రాఫిక్ ఎస్‌ఐ మెట్ట సుధాకర్ తెలిపారు. వాహన చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. సెఫోస్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయొద్దన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జి.సిగడాం: బాలికలు తమకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సంస్థ ప్రతినిధి కుప్పిలి ప్రసన్న రాణి అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీలో బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లలను చదివించడంతో పాటు, స్వీయరక్షణపై శిక్షణ అవసరమన్నారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు, మహిళలకు ఎటువంటి నష్టం కలిగినా 100, 1098, 1081, 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ ఉషారత్న కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని అంబేద్కర్ కూడలిలో పశువుల ఆసుపత్రి గోడకు ఆనుకొని రోడ్ల అక్రమంగా నిర్మించిన దుకాణాలను కమిషనర్ ప్రసాదరావు ఆదేశాల మేరకు బుధవారం ఎంహెచ్‌వో సుధీర్‌కుమార్, ప్లానింగ్ అధికారి ఉమా సమక్షంలో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో దుకాణాల ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో ఈ దుకాణాలను తొగించినట్లు కమిషనర్ తెలిపారు.

క్రీడా జట్ల ఎంపిక

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా మైదానంలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) మండలస్థాయి క్రీడాజట్లు ఎంపిక ప్రక్రియలో ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో మండల స్థాయి క్రీడా జట్లు ఎంపికలు నిర్వహించారు.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి


సీమంతాలు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: బాలింతలు, గర్భిణులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని టీడీపీ నాయకులు, 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం 22వ వార్డు అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో నాగరాణి, సూపర్‌వైజర్లు సుజాత, నీలవేణి, అంగన్వాడీ కార్యకర్తలు సురేఖ, కోమలి, జ్యోతి, పుణ్య, ఫాతిమా, ఎస్‌హెచ్‌జీ రమణమ్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తోటపాలెం రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

ఎచ్చెర్ల: ప్రేమ స మాజం జంక్షన్ నుంచి తోటపాలెం వెళ్లే రోడ్డులో నిరంతరం ట్రాఫిక్ కష్టా లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ప్రతి రోజు వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. అసలే చిన్న రోడ్డు కావడం వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. అప్పుడప్పుడు భారీ వాహనాలు కూడా ఈ రోడ్డు మీద వస్తుండడంతో ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది ఏర్పడుతుంది. ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

కంచిలి: కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని వక్తలు పేర్కొన్నారు. బూరగాంలో గోపినాథ్ అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఒక మంచి అభ్యుదయవాదిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.తారకేశ్వరరావు, అంగన్వాడీ, భవన నిర్మాణ కార్మికులు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

- **పొందూరు:** శ్రామికులు, కార్మికుల హక్కులకోసం నిరంతరం పోరాడిని సీపీఎం జాతీయనేత సీతారాం ఏచూరి మరణం కార్మికలోకానికి తీరనిలోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రం మార్కెట్ యార్డులో బుధవారం ఏచూరి సంతాపసభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.


స్కూల్ కాంప్లెక్స్ సద్వినియోగం చేసుకోవాలి

గార: ప్రతీ సబ్జెక్ట్ టీచర్ కూడా స్కూల్ కాంప్లెక్స్‌లకు తప్పనిసరిగా హాజరు కావాలని అక్కడ సబ్జెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా వారి సబ్జెక్టు మరింతగా అవగాహన కలుగుతుందని డీఈవో ఎస్.తిరుమల చైతన్య అన్నారు. బుధవారం ఉదయం స్థానిక జడ్పీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు.

దేవి ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



ఎచ్చెర్ల: కుంచాల కురమయ్య పేటలోని దేవీ ఆశ్రమంలో బుధవారం పౌర్ణమి పూజలు నిర్వహిం చారు. ఆశ్రమ పీఠాధిపతి తేజో మూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు.


విజయవాడలో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండుశంకర్.. సీఎంతో మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

టాయిలెట్ల నిర్మాణం పూర్తిచేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లాలో సొంత భవనాలు గల అంగన్‌వాడీ కేంద్రాల్లోని 533 టాయిలెట్ల నిర్మాణం, 526 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ దీనికి సంబంధించి రూ.2,81,30,000ల నిధులను సంబంధిత ఇంజనీరు వారి ఖాతాకు జమ చేయడం జరిగిందన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్: విభిన్న ప్రతిభావంతుల కోసం శుక్రవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుందని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను గ్రీవెన్స్‌లో తెలియజేయాలని కోరారు.

అభివృద్ధికి సహకరించాలి

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) రిజిస్ట్రార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అమరేంద్ర కుమార్‌ను నూజివీడు క్యాంపస్‌లో బుధవారం శ్రీకాకుళం క్యాంపస్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం క్యాంపస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని కోరారు. క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు తదితరులు ఉన్నారు.

మేదర కులస్థులను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం: వృత్తి నైపుణ్యం పెరిగేలా ఆధునిక పరికరాలు అందించి మేదర కులస్థులను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కన్వీనర్, బీసీ మేదరి సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ దూళిపాళ్ల ఏసుబాబు అన్నారు. బుధవారం జాతీయ వెదురు దినోత్సవం వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గురూజీ భరతనంద స్వామీజీ, ఏసుబాబు, అంతరాష్ట్ర మహేంద్ర మేదరి సంఘం అధ్యక్షుడు తెల్లి ధర్మారావు, కార్యదర్శి తెల్లి వెంకటకృష్ణ, కన్వీనర్ కోయిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జి.సిగడాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని జడ్పీటీసీ కాయల రమణ అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీఎస్ మూర్తి ఆధ్వర్యంలో మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- విద్యతో పాటు, క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, మీసాల వెంకటరమణ, కూటమి నాయకులు కుమరావు రవికుమార్, వజ్జిపర్తి రఘురాం, మీసాల రవికుమార్, భూపతి అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాన్ని వినియోగించుకోండి

ఆమదాలవలస: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొనే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మిన్, ఎమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సొంత ఇళ్లు కలిగిన వారు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏఈ జి.రామారావు, మున్సిపల్ ఏఈ కె.అప్పలనాయుడు, ఇన్‌చార్జి మేనేజర్ కేఎస్‌పీ చక్రవర్తి, ఆర్‌ఐ గోవిందరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

సరుబుజ్జిలి: పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా హిందీ ఫోరం శ్రీకాకుళం వారు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం సరుబుజ్జిలి పాఠశాల సముదాయంలో ఆవిష్కరించారు. కాంప్లెక్స్ కన్వీనర్ సీపాన జగన్నాథరావు సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట మండలాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులకు వాటిని అందించారు. సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట సమన్వయకర్తలు మావుడూరు భాస్కరరావు, కె.గౌరీశంకర్, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నర్సింగరావు వందన సమర్పణ చేశారు.

సింగూరు రోడ్డు పరిశీలన

పొందూరు: సింగూరు రోడ్డు ఏటా రెల్లిగెడ్డకు వస్తున్న వరదలకు భారీగా కోతకు గురవుతోంది. ఈ ఏడాది పదిరోజుల క్రితం వచ్చిన వరదలకు గ్రామ సమీపంలో రోడ్డు భారీగా కోతకు గురైంది. సుమారు ఎనిమిది అడుగుల మేర రోడ్డు కృంగిపోయింది. సమస్యను ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి గ్రామ నాయకులు తీసుకువెళ్లారు. రోడ్డు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరడంతో పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, ఏఈ సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈ రమణ, ఏఈ రవి బుధవారం రోడ్డును పరిశీలించారు. భారీగా రోడ్డు కృంగినట్లు గుర్తించారు.

ఎరువులు వాడాలి

రణస్థలం: భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలని డీఆర్‌సీ ఏవో సూర్యకుమారి రైతులకు సూచించారు. వేల్చురాయి గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ మరియూ ఏటీఎమ్‌ఏ వారి సౌజన్యంతో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం మరియూ ఎరువులు యాజమాన్యం పై శిక్షణ ఇచ్చారు.